లేబర్ కోడ్‌లపై కొట్లాటే..

- వాటి వ్యతిరేక ఆందోళనలో బిఆర్ఎస్ ఎక్కడ?
- రాష్ట్రంలో అమలు చేయబోమని కాంగ్రెస్ ప్రకటించాలి
- హక్కుల కోసం సంఘటిత పోరాటాలు
- సమరశీలంగా ఉద్యమిద్దాం- కేంద్ర విధానాలను తిప్పికొడదాం : బివి రాఘవులు
- మెదక్‌లో ఉత్సాహపూరిత వాతావరణంలో బహిరంగ సభ



భారీ ర్యాలీగా వెళుతున్న కార్మికులు, పైన బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులను కట్టుబానిసలుగా చేసేందుకు కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునేదాకా తెగించి కొట్లాడాలని సిఐటియు ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పిలుపునిచ్చారు. కార్మికవర్గం తన హక్కుల కోసం మరిన్ని ఉద్యమపోరాటాలు నిర్వహించాల్సిన తరుణం ఆసన్నమైందని ఆయన సూచించారు. సంఘటిత, సమరశీల పోరాటాలతో కేంద్రం మెడలు వంచాలని, తద్వారా దాని విధానాలను ప్రతిఘటించాలని దిశా నిర్దేశం చేశారు. సిఐటియు తెలంగాణ ఐదో రాష్ట్ర మహాసభ సందర్భంగా తొలిరోజైన ఆదివారం మెదక్ పట్టణంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ నుంచి చిల్డ్రన్స్ పార్కు వరకు నిర్వహించిన ఈ ప్రదర్శన అద్యంతం కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలతో మార్మోగింది. ర్యాలీ అగ్రభాగంలో రాఘవులుతోపాటు సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె హేమలత, జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, ఎస్వీ రమ, జె వెంకటేశ్, జె మల్లిఖార్జున్ తదితరులు ఉండి.. ప్రదర్శనను ముందుకు నడిపించారు.

అనంతరం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రాఘవులు మాట్లాడుతూ... నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిన మోడీ సర్కార్ వాటిని కచ్చితంగా అమలు చేయాల్సిందేనంటూ రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోందని చెప్పారు. వాటిని తీసుకురావడంలో మతలబేంటని ప్రశ్నించారు. కోడ్‌లను తక్షణం అమలు చేయాలంటూ కేంద్రం ఎందుకు పట్టుబడుతోందనే విషయంపై కార్మికులు ఆలోచించాలని సూచించారు. దేశంలో ఉన్న కోట్లాది మంది కార్మికులు తమ చట్టాలను సవరించాలని ఎప్పుడైనా అడిగారా? లేబర్ కోడ్‌లను తీసుకొస్తే తమకు ప్రయోజనం చేకూరుతుందని వారు మోడీకి మొరపెట్టుకున్నారా? అలాంటిది ఏమీ లేదు కదా? అయినా ఇంత హడావుడిగా, ఆదరాబాదరాగా ఎందుకు ఈ కోడ్‌లను ప్రభుత్వం తీసుకొచ్చిందనే దానిపై దృష్టి సారించాలని అన్నారు.

తమ లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను సవరించాలంటూ పెట్టుబడిదారులు మోడీపై ఒత్తిడి తెచ్చారు... దానికి అంగీకరించారు కాబట్టే ఆయన్ను వారు అధికారంలోకి తీసుకొచ్చారని రాఘవులు చెప్పారు. కార్మికులను అణచడంలో సమర్థత కలిగిన నాయకుడు మోడీ అని కార్పొరేట్లు భావించారు కాబట్టే...వేల కోట్ల రూపాయల ఫండ్ ఇచ్చి బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చారని విశదీకరించారు. అందువల్ల కార్పొరేట్లకు ఇచ్చిన మాట ప్రకారం ఆ చట్టాలను సవరించి పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు బిజెపి సర్కారు తహతహలాడుతోందని చెప్పారు.

కార్మికుల ప్రయోజనాల కోసమే ఈ చట్టాలను సరళతరం చేశామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నదని రాఘవులు విమర్శించారు. ఇందులో ఎంత అవాస్తవముందో అర్థం చేసుకోవాలని సూచించారు. దేశంలో కార్మికుల వేతనాలు, ఆదాయాలు ఏ మేరకు పెరుగుతున్నాయి? అదే సమయంలో కార్పొరేట్ల ఆదాయాలు, లాభాలు ఏ విధంగా పెరుగుతున్నాయో పరిశీలించాలని అన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల కార్మికుల నిజ వేతనాలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరో పక్క ప్రతియేటా దేశంలో కొత్తగా 70 మంది శతకోటీశ్వరులు పుట్టుకొస్తున్నారని గుర్తు చేశారు. ఈ కాలంలో 350 మంది శతకోటీశ్వరులకు రూ.50 లక్షల కోట్ల ఆస్తులు పెరిగాయని చెప్పారు. దేశ బడ్జెట్ కంటే వీరి ఆస్తులు, లాభాలే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అంబానీ, అదానీల ఆస్తులు లక్షల కోట్లకు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. ఎనిమిది గంటల పని విధానం కోసం ఆనాడు పోరాడి సాధించుకున్న హక్కులకు ఈ రోజు మోడీ ప్రభుత్వం సమాధి కడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కార్మికులతో 14,15 గంటలు పనిచేయిస్తున్నారని తెలిపారు. స్కీమ్ వర్కర్లు గొడ్డు చాకిరీ చేస్తున్నారని, వారంతా దళిత బహుజనులేనని చెప్పారు. వీరికి వేతనాలు పెంచేందుకు ప్రభుత్వాలు ఇష్టపడటం లేదని అన్నారు.

కార్మికుల మెడపై కత్తి : డాక్టర్ కె హేమలత

డాక్టర్ కె హేమలత మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల మెడపై కత్తులాంటివని చెప్పారు. పాత చట్టాల్లో కార్మికుల రక్షణ కోసం ఉన్న కొద్దిపాటి అంశాలను తొలగించటమంటే...కార్పొరేట్ల లాభాల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న ఎనలేని ప్రేమ ఉందో అర్థమవుతున్నదని చెప్పారు. సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న ఆ చట్టాలను ధ్వంసం చేయడం మోడీకి తగునా? అని ప్రశ్నించారు. కార్మిక చట్టాల్లోని కనీస వేతనం, డిఎ, బోనస్, పిఎఫ్, ఈఎస్ఐ,తదితర ఏ ఒక్క అంశం అమలు జరగకపోయినా అధికారులు తనిఖీచేయాలని అన్నారు. ఇది ఇప్పటివరకూ చట్టాలు చేసే మార్గదర్శనమని చెప్పారు. కానీ ఇక ముందు యూనియన్లు ఫిర్యాదు చేసినా, కార్మికులు ఫిర్యాదు చేసినా ఎలాంటి తనిఖీలు ఉండబోవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక నుంచి ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఎన్ని సంవత్సరాలైనా పర్మినెంట్ చేయకుండా పని చేయించుకునే విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. ఏ పేరు పెట్టినా కార్మికులను జీవితాంతం పర్మినెంట్ చేయకుండా పని చేయించుకునేవిధంగా లేబర్‌కోడ్‌ల సారాంశమని వివరించారు. కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లలో స్కీమ్ వర్కర్లు, డొమెస్టిక్ వర్కర్లు, హోమ్ బేస్డ్ వర్కర్లు, వ్యవసాయాధారిత కూలీల గురించి ప్రస్తావించలేదని చెప్పారు. సామాజిక భద్రత పేరుతో అనేక సౌకర్యాలను తొలగించి, యాజమానులకు ప్రయోజనం చేకూర్చే చర్యలకు పాల్పడిందన్నారు. కార్మిక శక్తి నీతి పేరుతో యాజమాన్యాలకు కార్మికులను బానిసలుగా మారుస్తున్నదని విమర్శించారు.అందుకే ఈ లేబర్‌కోడ్‌లు ఒక మోసం, దగా అని విమర్శించారు.రాబోయే కాలంలో మరింత ఉధృత పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రమాద ఘంటికలు : సాయిబాబు

ఎం సాయిబాబు మాట్లాడుతూ..నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల పాలిట ప్రమాద ఘంటికలని చెప్పారు. 29 చట్టాలను సరళీకరించామనీ, సింపుల్‌పై చేశామని చెబుతుంటే కార్మికులు నమ్మేందుకు సిద్ధంగా లేరని అన్నారు. కార్మిక కోడ్‌లలో ఉన్న నీతి..నేతి బీరలో నేయిలాంటిదేనని ఎద్దేవా చేశారు. వ్యాపార సులభతరం అని చెబుతూనే..కార్మికుల ప్రయోజనకోసమేనని చెప్పడం పొంతన లేని ప్రచారమని విమర్శించారు. ధర్మాల గురించి చెబుతున్నారు కదా..ఏమీ అడక్కుండా పని చేయటమే ధర్మమా? హక్కులు, చట్టాలు ఎవరయ్య జాగీరూ కాదని చెప్పారు. కేంద్ర బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెబుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఈ లేబర్‌కోడ్‌లను రాష్ట్రంలో అమలు చయబోమని చెప్పే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కార్మికుల హక్కులను అణిచి వేసిందనీ, కాంగ్రెస్ కూడా అదే విధంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ రెండు పార్టీలు బిజెపి బాటలో నడుస్తాయా? కార్మికుల పక్షంఉంటాయా? తేల్చుకోవాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించటంతోనే ఆగకుండా..కార్మికుల సమస్యలతో పాటు ఆర్టీసీ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదనపు బస్సులను ఎందుకు పెంచటం లేదని ప్రశ్నించారు. సింగరేణిలో బకాయిలు పేరుకుపోతున్నాయనీ, విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఖరి ప్రకటించాలన్నారు. అందుకే పాలక వర్గాలు..కార్మిక హక్కులను హరించే విధంగా, యాజమాన్యాల ప్రయోజనాలను కాపాడేందుకు దూకుడుగా ముందుకు వస్తున్నాయనీ, వీటికి వ్యతిరేకంగా ఐక్యతా మార్గంలో మన పోరాటాన్ని నడపాలని పిలుపునిచ్చారు.

కార్మికవర్గానికి ఉరితాళ్లు : చుక్క రాములు

సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మొత్తం కార్మిక వర్గానికి ఉచ్చు బిగుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమానుల, కార్పొరేట్ల గరిసెల్లోకి లాభాల వరద పారించేందుకు నేడు లేబర్ కోడ్‌లను అమలు చేస్తున్నదని చెప్పారు. కార్మిక హక్కులను తుంగలో తొక్కుతున్న పాలకుల విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

వ్యతిరేకించాలి : పాలడుగు భాస్కర్

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఈ లేబర్ కోడ్‌లను అమలు చేయబోమంటూ కేంద్రాన్ని వ్యతిరేకించాలి, ధిక్కరించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌లో కార్మికుల పాత్రను రేవంత్ ప్రభుత్వం విస్మరించటం ఆయన వర్గ స్వభావానికి నిదర్శమని విమర్శించారు.

సుద్దులు చెబుతున్న కేంద్రం : ఎస్.వీరయ్య

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ శ్రమశక్తినీతి విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి కార్మికులకు ధర్మ సుద్దులు చెబుతున్నదని విమర్శించారు. దేశభక్తి అంటే పెట్టుబడిదారుల భక్తి తప్ప మరొకటి కాదన్నారు. భారతీయ కార్మికులు పవిత్రమైన ధర్మంగా తలవంచుకుని పనిచేయాలని మోడీ సూచిస్తున్నారని గుర్తు చేశారు. అంటే ఏ కార్మికుడు తమ హక్కుల గురించి, బతికే హక్కు గురించి, కుటుంబం బతకటానికి అవసరమైన వేతనం గురించి అడిగితే.. అది ధర్మాన్ని తప్పటంగా ఈ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నదని గుర్తు చేశారు.

స్కీం వర్కర్ల పరిస్థితి అధ్వాన్నం : ఎస్వి రమ

ఎస్వీ రమ మాట్లాడుతూ రాష్ట్రంలో స్కీం వర్కర్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. వేతనాలు నిర్ణయించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. బీడీ కార్మికుల బతుకులు మరింత దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో అనేక మంది అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సభలో రాష్ట్ర ఆఫీసు బేరర్లు, మెదక్ జిల్లా సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు బాలమణి,మల్లేశం, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు అడివయ్య, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రాన్ని గ్రోత్ ఇంజన్‌గా మారుస్తాం

- స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వమే మా మూల సిద్ధాంతాలు
- ఇప్పటివరకు ఒక లెక్క.. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరోలెక్క : రేవంత్ రెడ్డి
- ప్రజా పాలనకు రెండేళ్లు.. సిఎం శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను భారతదేశానికే గ్రోత్ ఇంజన్‌గా మారుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వమే మూల సిద్ధాంతాలుగా ముందుకెళ్తున్నట్టు స్పష్టం చేశారు. జాతి కోసం, జనహితం కోసం గొప్ప కలలు కనాలంటే ధైర్యముండాలనీ, గొప్ప కార్యాలు చేయాలంటే మహా సంకల్పం కావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం తనకు ఆ ధైర్యం ఇచ్చి, తమ ఓటుతో గెలుపు సంకల్పాన్ని ఇచ్చి, నిండు మనస్సుతో ఆశీర్వదించిన తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రెండేళ్లలో తెలంగాణను అన్ని రాష్ట్రాల్లో శిఖరాగ్రాన నిలిపేందుకు అనునిత్యం శ్రమిస్తున్నట్టు పేర్కొన్నారు.

"గత పాలన శిథిలాల కింద కొనఊపిరితో ఉన్న నవతరానికి కొలువుల జాతరతో కొత్త ఊపిరి పోశాం. రుణభారంతో వెన్ను విరిగిన రైతుకు దన్నుగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిపాం. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థిక మద్దతిచ్చి అదానీ, అంబానీల లెక్క వ్యాపారరంగంలో నిలిపాం. బలహీనవర్గాల వందేళ్ల ఆకాంక్షలను కుల లెక్కలతో కొత్త మలుపులు తిప్పాం. వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమానికి నిజమైన సార్థకతను ఇచ్చాం. చదువొక్కటే బతుకు తెరువుకు బ్రహ్మాస్త్రం అని నమ్మి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణ యజ్ఞానికి పునాదులు వేశాం. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టాం. "జయ జయహే తెలంగాణ" అన్న ప్రజాకవి అందెశ్రీ గేయానికి, జన ఆకాంక్షల మేరకు అధికారిక గుర్తింపు ఇచ్చాం. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డలకు ఉచిత బస్సు పథకం, రూ.500కే గ్యాస్, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే గొప్ప పథకాలన్నీ ఈ రెండేళ్ల సంక్షేమ చరిత్రకు సాక్ష్యాలు..... " అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.నేటి అవసరాలు తీర్చి, పేదల సంక్షేమం కూర్చి ఇదే అద్భుతమని తాము సరిపెట్టలేదని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారత ప్రయాణం వందేళ్ల మైలురాయికి చేరే సందర్భం 2047 నాటికి మన తెలంగాణ ఎలా ఉండాలి? ఎక్కడ ఉండాలనే విషయమై లోతైన మథనంతో మార్గదర్శక పత్రం సిద్ధం చేసినట్టు వెల్లడించారు. గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు తాము ప్రాణం పోసినట్టు ఆయన వెల్లడించారు. ప్రపంచ వేదికపై తెలంగాణ రైజింగ్ రీ సౌండ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఇప్పటి వరకు ఒక లెక్క "తెలంగాణ గ్లోబల్ సమ్మిట్" తర్వాత మరో లెక్క అని పేర్కొన్నారు. నిన్న, నేడు, రేపు..ఎప్పుడైనా ప్రజల ఆశీర్వాదమే తన ఆయుధమనీ, వారి ప్రేమాభిమానాలే తనకు సర్వమని, వారి సహకారమే తనకు సమస్తమని తెలిపారు. తెలంగాణ తనకు తోడుగా ఉన్నంత వరకు, తన గొంతులో ఊపిరి ఉన్నంత వరకు తెలంగాణ రైజింగ్‌కు తిరుగు లేదని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన రెండేళ్ల విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.


జోసఫ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని

సామాజిక మార్పునకు మార్క్సిజమే మార్గం

- జోసఫ్ సంస్మరణ సభలో తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనేక రుగ్మతలతో కూడిన ప్రస్తుత దోపిడీ సమాజ మార్పుకు మార్క్సిజమే మార్గమని, నమ్మినవాడు కామ్రేడ్ ఇనుపనూరి జోసఫ్ అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం ఖమ్మంలోని మంచికంటి భవనంలో బివికె జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు అధ్యక్షతన ఇనుపనూరి జోసఫ్ సంస్మరణ సభ జరిగింది. ముందుగా జోసఫ్ సార్ చిత్రపటానికి తమ్మినేని, నున్నా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో తమ్మినేని మాట్లాడుతూ.. జోసెఫ్ మార్క్సిస్టు సైద్ధాంతిక విషయాలను అధ్యయనం చేయడంలో, వాటిని నిత్య జీవిత కార్యాచరణకు అన్వయించడంలో తగిన క్రమశిక్షణను పాటించేవారని కొనియాడారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ ఆయన ఒక మంచి మార్క్సిస్టు ప్రచారకునిగా కృషి చేశారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి రిటైర్ అయిన తర్వాత అనేక సామాజిక, సాంస్కృతిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని చెప్పారు. బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బివికె) మేనేజింగ్ కమిటీ సభ్యులుగా, ఆదివారం మీకోసం కమిటీ నిర్వాహకులుగా, స్టడీ సర్కిల్ సభ్యులుగా అనేక రూపాల్లో ఆయన కార్యకలాపాలను నిర్వహించారని అన్నారు. మార్క్సిస్టు స్టడీసర్కిల్‌లో ఒక సభ్యునిగా పాల్గొంటూ, మార్క్సిజం-లెనినిజం సైద్ధాంతిక విషయాలను కొత్త తరానికి అందించడం కోసం తపన పడేవారని తెలిపారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ జోసఫ్.. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతం, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అనేక ప్రాంతాల్లో టీచర్‌గా, లెక్చరర్‌గా పనిచేస్తూ అనేక వందల మంది విద్యార్థులకు విద్యాబోధన చేశారని తెలిపారు. వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాల్లో పనిచేసే కార్యకర్తలను నిరంతరం ప్రోత్సహించేవారని, వారికి సహకరించేవారిని గుర్తు చేశారు. మార్క్సిస్టు సాహిత్యాన్ని భద్రపరుస్తూ తన చుట్టూ ఉన్న వారికి అందించడంలో ఆయన నిత్యం కృషి చేసే వారన్నారు. పార్టీ పట్ల, పార్టీ సిద్ధాంతం పట్ల జోసఫ్ సార్ అచంచలమైన విశ్వాసం కలిగి ఉండేవారని కొనియాడారు. ఈ సందర్భంగా జోసఫ్‌కు ఘనంగా నివాళులు అర్పించి, కుటుంబానికి సంతాపాన్ని తెలిపారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు పి సోమయ్య, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేశ్, మెరుగు సత్యనారాయణ, బండి పద్మ, జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేశ్, నందిపాటి మనోహర్, ఎస్‌కె మీరా, నాయకులు టిఎల్ నర్సయ్య, ఆర్ ప్రకాష్, బివికె బాధ్యులు ఎస్కే ఆఫ్జల్, వాసిరెడ్డి వీరభద్రం, ఎస్ నాగేశ్వరరావు, తుమ్మల వెంకటరావు, ఎస్.గోవింద్‌రావు, ఎన్.పురుషోత్తంరావు, జోసఫ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



హిల్ట్ పీ పాలసీని నిలిపివేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల సొమ్మును దోచుకునే హిల్ట్ పీ పాలసీని వెంటనే నిలిపివేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సోషల్ ఫౌండేషన్ (టిఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో 'హిల్ట్-పీ ఎవరి కోసం-ఎందుకోసం' అంశంపై టిఎస్‌ఎఫ్ ఒ నరసింహా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములను ఇష్టం వచ్చినట్టు తమకు నచ్చిన వారికి కట్టబెడతామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలి కానీ ప్రభుత్వ భూములను అప్పనంగా అమ్మి పెట్టడానికి ఎందుకు ఆరాటపడుతున్నారని ప్రశ్నించారు. పారిశ్రామిక భూములను ఒక పథకం ప్రకారం తక్కువ ధరకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజల సొమ్మును దోచుకునే హిల్ట్ పీ పాలసీని వెంటనే నిలిపివేయాలని, అఖిల పక్షాన్ని ఏర్పాటు చేసి దీనిపై ప్రత్యేకంగా చర్చించాలని డిమాండ్‌చేశారు. భూ దోపిడీకి పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ప్రజల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఇష్టం వచ్చినట్టు తమకు నచ్చినవారికి కట్టబెడుతున్నారని విమర్శించారు. ఐదు లక్షల కోట్ల ప్రజల ఆస్తిని 440మంది పంచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగస్వాములైన వారిని ఎవ్వరినీ వదలబోమని అన్నారు. న్యాయ పోరాటం చేసి భూములను కాపాడుతామని తెలిపారు. ప్రజా అవసరాల కోసమే ఇండస్ట్రియల్ భూములు వినియోగించాలని సూచించారు. హైదరాబాద్ ప్రజలనే కాదు, తెలంగాణ ప్రజలను మోసం చేయడానికే ఈ హిల్ట్ పి పాలసీ అని ఆరోపించారు. 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం నాచారం ఇండస్ట్రియల్ ఏరియాను 700 ఎకరాలతో నిర్మించిందని తెలిపారు. అయితే పొల్యూషన్ చేసే కంపెనీలను తరలించాలనే సాకుతో ప్రభుత్వం పొల్యూషన్ చేయని కంపెనీలనూ తరలించాలని చూస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో ప్రముఖ సామాజిక ఆర్థిక విశ్లేషకులు పాపారావు, రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచీతం శ్రీధర్, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు గోవర్ధన్, రచయిత్రి గోగు శ్యామల, వ్యాపారవేత్త యుగంధర్ రావు, పాత్రికేయులు రమణకుమార్, ప్రభాకర్, బైండ్ల విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ట్రంప్ ఎవెన్యూ, గూగుల్ స్ట్రీట్

- అంతర్జాతీయ టెక్ కంపెనీల పేర్లతో రోడ్
- ఫ్యూచర్ సిటీ ప్రధాన రోడ్డుకు రతన్‌టాటా పేరు
- సిఎం రేవంత్‌రెడ్డి వినూత్న ప్రతిపాదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినూత్న ప్రతిపాదన చేశారు. ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి గడించిన హైదరాబాద్‌కు మరింతగా గ్లోబల్ మ్యాప్‌లో చోటు కల్పించేలా సిఎం సంకల్పించారు. అందుకనుగుణంగా ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు, కంపెనీల పేర్లను హైదరాబాద్‌లో ప్రధాన రహదారులకు పెట్టాలని నిర్ణయించారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ వద్ద రావిర్యాలను నుంచి ప్రారంభమై ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేసే 100 మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్‌కు పద్మవిభూషణ్ రతన్ టాటా పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రావిర్యాల ఇంటర్‌చేంజ్‌కు ఇప్పటికే 'టాటా ఇంటర్‌చేంజ్' అని పేరు పెట్టారు. యూఎస్ కాన్సులేట్ రోడ్డుకు డోనాల్డ్ ట్రంప్ ఎవెన్యూగా నామకరణం చేసింది. అలాగే ప్రపంచంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ పేరుతో 'డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ' అనే పేరు నిర్ణయించారు. ఈ నిర్ణయంపై కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు అమెరికా రాయబార కార్యాలయానికి ప్రభుత్వం లేఖ రాయనుంది.

మరిన్ని ప్రధాన రహదారులకు గ్లోబల్ దిగ్గజ కంపెనీల పేర్లు

ఢిల్లీలో ఇటీవల జరిగిన యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం వార్షిక సదస్సులో సిఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ప్రకారం హైదరాబాద్‌లోని ముఖ్యరహదారులకు ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల పేర్లు పెట్టాలన్న దృష్టిలో భాగంగా మరిన్ని ప్రతిపాదనలు చేసినట్టు తెలిపారు. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సేవలను గుర్తిస్తూ ఒక ముఖ్య రహదారిని గూగుల్ స్ట్రీట్ అని ప్రకటించేందుకు సర్కారు ప్రణాళిక రూపొందించింది. మైక్రోసాఫ్ట్ రోడ్, విప్రో జంక్షన్ పేర్లను పరిశీలిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా ప్రభావిత వ్యక్తులు, ప్రముఖ కంపెనీల పేర్లను రహదారులకు పెట్టడం ద్వారా వారికి సముచిత గౌరవం ఇవ్వడంతోపాటు హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని సిఎం భావిస్తున్నారు. ఆ రోడ్‌పై ప్రయాణించే వారికి కూడా స్ఫూర్తిమంతంగా ఉంటుందనే ఉద్దేశంతో ఆయన ఈ సందర్భంగా ప్రతిపాదన చేశారు.


సెంట్రల్ బ్యాంక్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిబిఐ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆదివారం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్, గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) సిఇఒ దివ్య దేవరాజన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దీంతో అర్హత కలిగిన స్వయం సహాయక బృందాలు సెంట్రల్ బ్యాంక్‌లో తమ సేవింగ్ ఖాతాలు తెరిచేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో పాటు రుణ సహకారాన్ని అందుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

యాసంగి సాగుకు నిజాంసాగర్ నీటి విడుదల



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా యాసంగి పంటల సాగు కోసం 1200 క్యూసెక్కుల నీటిని నేటి నుంచి 15 రోజుల పాటు అలీ సాగర్‌కు వదులుతున్నట్టు ప్రాజెక్ట్ ఎఇఇ సాకేత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాలువ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాలువలోకి ఎవరు దిగొద్దని సూచించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టిఎంసిల నీటికి గాను ప్రస్తుతానికి 17.802 టిఎంసిల నీరు నిలువ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

విద్యామందిర్ క్లాసులు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో




ఐఐటి, జెఇఇ, నీట్ ప్రవేశపరీక్షల కోచింగ్‌తో పాటు విద్యార్థులను అద్భుతమైన ఇంజనీర్లు, డాక్టర్లుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో హైదరాబాద్ కేంద్రంగా విద్యామందిర్ క్లాసెస్ ప్రారంభమైంది. 40 ఏళ్లుగా దేశానికి 20 వేల మంది ఐఐటియన్లు, డాక్టర్లను అందించిన అనుభవంతో హైదరాబాద్‌లో సేవలు విస్తరిస్తూ.... మాదాపూర్, సుచిత్రల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్‌తో పాటు ఐఐటి, నీట్ కోచింగ్ కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించింది. ఈ మేరకు బేగంపేట్ గ్రీన్ పార్క్ హెూటల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ కార్యకపాలను డిఆర్‌డిఒ మాజీ చైర్మన్ జి సతీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... విద్యామందిర్ క్లాసెస్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. విఎంసి అద్భుత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కేవలం ఐఐటియన్స్, డాక్టర్లను మాత్రమే కాకుండా విద్యాసంస్థలు, దేశానికి అవసరమైన వత్తి నిపుణులను తయారు చేయాలని కోరారు. తాము చదువుకునే రోజుల్లో కేవలం ఐఐటీ రామయ్య కోచింగ్ సెంటర్ మాత్రమే విద్యానగర్ లో ఉండేదని.... అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. భారత్ ను ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మలిచేందుకు... నిబద్ధత, క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం, కార్యదక్షత కలిగిన ఇంజినీర్లను, డాక్టర్లను, ఇతర రంగాల నిపుణులను అందించాలనిసూచించారు. విద్యామందిర్ క్లాసెస్ సిఇఒ కౌశిక్ మిశ్రా మాట్లాడుతూ...40 ఏళ్లుగా వీఎంసీ ఎదిగిన తీరును వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా విఎంసి వేలాది విద్యార్థులు, తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తుందని ఆకాంక్షించారు. దక్షిణ భారత దేశంలో తొలిసారిగా మాదాపూర్, సుచిత్రల్లో విఎంసి ఐఐటి జెఇఇ, నీట్ తో ఇంటర్ విద్యను అందించనున్నట్లు స్పష్టం చేశారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతుల్లో విద్యాబోధన ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఎంసి పుస్తకాలు, యూనిఫాం, కళాశాల డిజిటల్ వీడియోను ఆవిష్కరించారు. సింబయాసిస్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ రజనీకాంత్, జివికె రెడ్డి, విఎంసి ఉపాధ్యక్షులు ప్రతీక్ భట్టాచార్య, దక్షిణాది హెడ్ గౌస్, ఎపి, తెలంగాణ హెడ్ శైలజా, విఎంసి హైదరాబాద్ డైరెక్టర్లు గౌతమి రెడ్డి, కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తెలంగాణ అభివృద్ధి

- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తెలంగాణను అభివృద్ధి చేస్తామని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ రెవెన్యూ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లతో పాటు డిజిటల్ సెషన్ హాల్‌ను మంత్రులు పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచన చేశారు. అనంతరం అక్కడే కనువిందు చేస్తున్న ఆర్‌టిసిలో మొదటి తరం బస్సు అయినటువంటి అల్బేన్ నుంచి ఎలక్ట్రిక్ బస్సు వరకు ఆర్‌టిసి అభివృద్ధి అని ప్రదర్శనగా ఉంచిన బస్సులను మంత్రులు ఆసక్తిగా తిలకించారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా హైదరాబాద్ బ్రాండ్ పెరుగుతుందని, ప్రపంచ దేశాలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయని చెప్పారు. వారి వెంట ఆర్‌అండ్‌బి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు బౌద్ధ ధర్మాన్ని పరిచయం చేస్తాం

- బౌద్ధ దేశాల రాయబారులతో మంత్రి జూపల్లి భేటీ

హైదరాబాద్ బ్యూరో : భవిష్యత్ తరాలకు బౌద్ధ ధర్మాన్ని పరిచయం చేసేందుకు వారి చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను భద్రపరుస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. హైదరాబాద్ ట్రైడెంట్ హెూటల్‌లో ఆదివారం ఆసియా, బౌద్ధదేశాలు, ఇతర విదేశీ రాయబారులు, హైకమిషనర్లతో సమావేశమయ్యారు. తెలంగాణ బౌద్ధ వారసత్వం, అంతర్జాతీయ పర్యాటక సాంస్కృతిక భాగస్వామ్యాలపై చర్చించారు.దక్షిణ భారతదేశంలో మహాయాన బౌద్ధానికి తెలంగాణ ప్రధాన కేంద్రంగా ఉందనీ, గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో బౌద్ధం పరిఢవిల్లిందంటూ నాగార్జునకొండ, ఫణిగిరి, ధూలికట్ట, నెలకొండపల్లి, కోటిలింగాల వంటి బౌద్ధ కేంద్రాల ప్రాముఖ్యతను మంత్రి వారికి వివరించారు. నాగార్జునసాగర్‌లో నిర్మాణం జరుగుతున్న బుద్ధవనం బౌద్ధ హెరిటేజ్ థీమ్‌పార్క్‌ను ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. బుద్ధుడి జీవిత చరిత్ర, బోధనలు, సర్వజన సంక్షేమం, ప్రేమ, శాంతి, సహజీవనంలతో కూడిన ప్రగతి దిశగా రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తుందని చెప్పారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని వారిని ఆహ్వానించారు.

నేటి నుంచి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి ఏర్పాట్లు
- పెట్టుబడులకు ఆహ్వానం, ప్రభుత్వ సహకారంపై చర్చ
- హాజరుకానున్న 44కుపైగా దేశాల ప్రతినిధులు
- మధ్యాహ్నం సదస్సును ప్రారంభించనున్న గవర్నర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుత ఏర్పాట్లను పూర్తిచేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44కుపైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరుకానున్నారు. విశ్వవ్యాప్తంగా పేరెన్నిక గల కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు ఈ సమ్మిట్‌లో పాల్గొనబోతున్నాయి. అమెరికా నుంచే 46 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు తరలిరానున్నారు. సోమవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రారంభసభకు రెండువేల మంది దేశ, విదేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. సమ్మిట్‌లో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియా-టెక్నాలజీ గ్రూప్ సిఇఒ ఎరిక్ స్వైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సిఇఒ జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్-షా, తదితరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం వైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై అతిథులకు ముఖ్యమంత్రి వివరిస్తారు. రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి. ఇందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే అంతర్జాతీయ, దేశీయ అతిథులు, పెట్టుబడిదారులకు తెలంగాణతో పాటు హైదరాబాద్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రచార సామాగ్రిని సిద్ధం చేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీతో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు జరిగాయి. లైటింగ్ ప్రొజెక్షన్, త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్‌లో ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా విభిన్న ప్రదర్శనలు ఉంటాయి.

సబ్జెక్టులపై చర్చల తర్వాత ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీత కచేరి అతిథులను అలరించనుంది. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గుడోలు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు అయిన బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం వెళ్లేలా టూరిజం శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సదస్సు జరిగే రెండు రోజుల పాటు హాజరైన అందరికీ పసందైన హైదరాబాదీ బిర్యానీతో పాటు, తెలంగాణ ప్రసిద్ధ వంటకాలతో భోజనాలను అందించేందుకు వంటశాలలు సిద్ధమయ్యాయి. ఇక అతిథులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండి పోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లకు కూడిన బహుమతిని ప్రభుత్వం తరపున అందించనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగో పాటు, పోచంపల్లి ఇక్కత్ శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈ సావనీర్‌లో పొందుపరుస్తారు. అలాగే తెలంగాణకే ప్రత్యేకమైన వంటలైన ఇప్ప పువ్వు లడ్డు, సకినాలు, చెక్కలు, బాదం కీ జాలి, నువ్వుల ఉండలు, మక్క పేలాలతో కూడిన మరో ప్రత్యేక బాస్కెట్‌ను కూడా అతిథులకు అందించనున్నారు.

నగరవ్యాప్తంగా పది ప్రాంతాల్లో ప్రత్యేక సమాచార కేంద్రాలు (స్టాల్స్) ఏర్పాటుచేస్తున్నారు. సమిట్‌కు సంబంధించిన వివరాలు, ఫ్యూచర్ సిటీ ప్రణాళిక, బ్రోచర్లు అక్కడ అందుబాటులో ఉంటాయి. ఆయా కేంద్రాల్లో ఉండే వాలంటీర్లు సమిట్‌లో జరిగే రోజువారీ కార్యక్రమాలను వివరించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ అతిథులకు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా..చార్మినార్, కాచిగూడ రైల్వే స్టేషన్, సహా అధికారక భవనాలపై ప్రత్యేకంగా లైటింగ్ ప్రొజెక్షన్ ఏర్పాటు చేశారు.

రాష్ట్ర సచివాలయం వద్ద ప్రత్యేకంగా త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్ సిద్ధం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ లక్ష్యాలను ఇక్కడ ప్రదర్శించనున్నారు. దుర్గం చెరువులో గ్లోబ్ ఆకారంలో తేలియాడే ప్రొజెక్షన్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ లోగోను ప్రదర్శించడంతోపాటు హుస్సేన్‌సాగర్‌లో వాటర్ ప్రొజెక్షన్‌తో భారత్ ఫ్యూచర్ సిటీ, మహిళా సాధికారత, యువత-రైతుల కోసం అమలుచేస్తున్న కార్యక్రమాలు, మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం తదితర అంశాలను ప్రదర్శించనున్నారు.

శంషాబాద్ విమానాశ్రయం నుంచి సమిట్ ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఇరువైపులా డిజిటల్ ఎల్ఈడీ తెరలను అమరుస్తున్నారు. వాటిపై ఫ్యూచర్ సిటీకి ఎలా వెళ్లాలి, ఎంత దూరం అనే వివరాలు పొందుపరుస్తున్నారు. సమిట్ మార్గంలో డిజిటల్ స్క్రీన్లతో ఏర్పాటుచేసిన గదుల వద్ద రోబోల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.



అందుబాటులో లేని మండల ఎన్నికల అధికారులు

- అభ్యర్థులు విత్ డ్రా చేసుకునేందుకు వస్తే కానరాని అధికారులు
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి రోజూ అభ్యర్థులకు అందుబాటులో ఉండి సేవలందించాల్సిన మండల ఎన్నికల అధికారులు మండల కార్యాలయానికి రాక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఇబ్బందులు పెడుతున్న సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం చోటుచేసుకుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు మండల ఎన్నికల అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని నిబంధన ఉన్నా అధికారులు భేఖాతర్ చేస్తున్నారు. మండల ఎన్నికల అధికారి, ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ మధ్యాహ్నం 12 గంటలైనా కార్యాలయానికి రాకపోవడంతో ఎన్నికల నుంచి తమ నామినేషన్ ఉపసంహరించుకునే అభ్యర్థులు అధికారుల రాకకోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఎన్నికల అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఫోన్ ద్వారా ఎంపిడిఒ వెంకటలక్ష్మమ్మకు సమాచారం అందించగా అభ్యర్థులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 9వ తేదీ వరకు విత్ డ్రా ఉండగా మీకెందుకంత తొందరంటూ అసహనం వ్యక్తం చేసిందని అభ్యర్థులు తెలిపారు. అలాగే, ఎంపిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటర్లలో చిన్నగొట్టి ముక్కుల, తిమ్మాపూర్, గూడూరు, టిక్యాదేవమ్మగూడ పంచాయతీల కోసం ఏర్పాటు చేసిన 6వ నెంబర్ కౌంటర్‌లో రిటర్నింగ్ అధికారి సునంద రెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్ అందుబాటులో లేకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చిన్నగొట్టిముక్కుల జీపీ 5వ వార్డు నుంచి నామినేషన్ దాఖలు చేసిన పానుగంటి నర్సమ్మ తన నామినేషన్‌ను విత్ డ్రా చేసుకునేందుకు ఉదయం 10 గంటలకు వస్తే ఎన్నికల అధికారులు అందుబాటులో లేకపోవడంతో చెట్ల కిందనే నిరీక్షించారు. అల్లీపూర్, లింగోజీగూడ, పిల్లుట్ల పంచాయతీల కోసం ఏర్పాటు చేసిన 9వ కౌంటర్‌లో రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అంజయ్య కూడా అందుబాటులో లేరు. ఎన్నికల అధికారులు అభ్యర్థులకు అందుబాటులో లేని విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగాయిపల్లి గోపి ఎంపిపి కార్యాలయానికి చేరుకొని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల కార్యాలయానికి చేరుకున్న ఎంపిడిఒ వెంకటలక్ష్మమ్మపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈతకు వెళ్లి.. గురుకుల విద్యార్థి మృతి

- నిజాంసాగర్ ప్రాజెక్టు కాలువ వద్ద ఘటన
- గురుకులం నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజాంసాగర్ ప్రాజెక్టు 16వ వరద గేటు వద్ద కాలువలో ఈతకు వెళ్లి గురుకుల విద్యార్థి మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలో ఆదివారం జరిగింది. గురుకులం కాలేజీలో ఉండాల్సిన విద్యార్థి ఇలా బయటకు రావడంపై.. గురుకులం నిర్వహణ తీరుపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని టిజిడబ్ల్యుఆర్‌జెసి కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారిలో ఐదుగురు విద్యార్థులు స్నానం చేయడానికి ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ప్రాజెక్ట్ 16వ గేటు వద్దనున్న కాలువలోకి వెళ్లారు. ఈ క్రమంలో అజయ్(17) అనే విద్యార్థి స్నానం చేస్తున్న క్రమంలో కాల్వలో మునిగాడు.. పక్కనే ఉన్న విద్యార్థులు గమనించి అజయ్‌ను ఒడ్డు మీదకు తీసుకు వచ్చేసరికి అపస్మారకస్థితిలోకి వెళ్లి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గురుకులం నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు

గురుకులం పాఠశాల, కళాశాల నిర్వహణపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల ప్రిన్సిపల్ జనార్ధన్ రెండు రోజుల నుంచి లీవ్‌లో ఉండగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా గణపతి ఉన్నారు. ఆదివారం డ్యూటీ టీచర్‌గా రవికాంత్ ఉన్నట్టు సమాచారం. ఆ సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లడం గమనార్హం. ప్రిన్సిపల్ లేని సమయంలో గురుకులం నిర్వహణ తీరు సరిగ్గా ఉండడం లేదని విద్యార్థిసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రెండేళ్లుగా తిరోగమనంలో రాష్ట్రం

- ఆర్థికవేత్త డి పాపారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండేళ్లుగా రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తుందని ప్రముఖ ఆర్థికవేత్త డి పాపారావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నాలెడ్జ్ క్రియేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో గోసుల శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన "రెండేళ్ల పరిపాలనలో ఏం జరిగింది?" అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాపారావు మాట్లాడారు. రాష్ట్రంలో 2015లో 1,209 మంది రైతుల ఆత్మహత్యలు చేసుకుంటే, 2023 నాటికి ఆ సంఖ్య 48కు తగ్గిందని తెలిపారు. తిరిగి గత రెండేండ్లలో 700 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడమే రాష్ట్రం తిరోగమనంలో వెళుతుందనేందుకు నిదర్శనమని చెప్పారు. ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందని చెప్పారు. బిఆర్ఎస్ పాలనే మెరుగ్గా ఉండేదని వ్యాఖ్యానించారు. ఎంవిఎఫ్ నేషనల్ కన్వీనర్ ఆర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ గతంలో టీచర్ల పోస్టులు ఖాళీ ఉండేవని, ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి పోస్టు ఖాళీగా ఉందని విమర్శించారు. విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రతి ఏడాది తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం ప్రయివేటుకు రూ.20 వేల కోట్లు ధారపోస్తున్నారనీ, ఈ పరిస్థితిలో మార్పు రావాలని సూచించారు. పిల్లల గురించి ఆలోచన చేయకుండా 2047 రైజింగ్ మాట్లాడటంలో ఉపయోగం లేదన్నారు. యుపిఎ హయాంలో తెచ్చిన విద్యా హక్కు చట్టంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే స్పందించకపోవడంపట్ల విచారం వ్యక్తం చేశారు. ఫీజులను నియంత్రించకపోవడంతో ప్రయివేటు దోపిడీ ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు నాయకులు రాజన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా విత్తన చట్టం తేవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఎస్సి, ఎస్‌టి కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ పల్లె రవికుమార్ తదితరులు మాట్లాడారు.

గంజాయి ప్యాకెట్లు అమ్ముతున్న మహిళల అరెస్ట్

- 532 ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని మేజర్‌బస్తీ, అఫ్జల్‌గంజ్ పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్న ఇద్దరు మహిళలను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) 18 ఇంచార్జి అధికారి అంజిరెడ్డి నేతృత్వంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు మహిళల వద్ద 400 గ్రాముల చొప్పున ఉన్నటువంటి 532 గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఉపాధ్యాయ బాలువ బాయి, కాంబ్లే గలన్ భాయ్ అనే మహిళలను అరెస్ట్ చేశారు. ఇదే కేసులో మరో పదిమందిపై కూడా కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.



మక్కలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

రేవంత్‌రెడ్డీ సిద్దిపేటకు రా..

- సిఎంపై హరీశ్‌రావు ఘాటు వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు రా.. నీకు బండకట్టి రంగనాయకసాగర్‌లో ఎత్తేసా.. నీళ్లు ఉండి నువ్వు మునిగిపోతే కాళేశ్వరం ఉన్నట్టు.. లేకుంటే లేదు' అంటూ సిఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. కాళేశ్వరం కూలిందని.. కెసిఆర్, హరీశ్‌రావును బండకేసి కొట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాలను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రెక్కలు ముక్కలు చేసుకుని మక్కలు పండిస్తే.. విక్రయించిన తర్వాత నెలలు గడిచినా డబ్బులు చెల్లించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నకోడూరులో 450 మంది రైతులకు 59 రోజుల నుంచి రూ.45 కోట్లు చెల్లించలేదన్నారు. రైతు ప్రభుత్వం అంటూనే రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు చేసిన తర్వాత రెండ్రోజుల్లో డబ్బులు చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పినప్పటికీ.. 50 రోజులు గడిచినా డబ్బులు చెల్లించలేదన్నారు. దాంతో యాసంగి పంట పెట్టుబడి కోసం రైతులు ప్రయివేటు మార్కెట్లో మక్కలను అమ్ముతున్నారని తెలిపారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న రైతులకు బకాయి పడ్డ రూ.450 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది నుంచి పంటవేస్తేనే రైతుబంధు ఇస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మాణిక్య రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, సొసైటీ చైర్మన్లు సదానందం గౌడ్, కనకరాజు, మాజీ వైస్ ఎంపిపి కీసర్ పాపయ్య, కామనీ శ్రీనివాస్, బోచబోయిన శ్రీహరి, జంగిటి శ్రీనివాస్, ఇట్టబోయిన శ్రీనివాస్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనుషులను చంపితే ఉద్యమాలు ఆగుతాయా?

- భారతీయ న్యాయవ్యవస్థ దారితప్పుతోంది
- నిఖిలేశ్వర్ పుస్తకావిష్కరణ సభలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

మనుషులను చంపితే ఉద్యమాలు ఆగవని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవి నిఖిలేశ్వర్ రాసిన "ఎక్కిడికి గమనం? ఎంత దూరమీ గమ్యం?.. ఎవరిదీ ప్రజాస్వామ్యం? ఏ విలువలకీ ప్రస్థానం?.. గోడల వెనుక" అనే మూడు పుస్తకాలను ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌కౌంటర్లు కాలం చెల్లిన విధానమని అభిప్రాయపడ్డారు. సాటి వ్యక్తి సాయం లేకుండా నడవలేని సాయిబాబాను ఎందుకు బంధించారని అడిగిన సందర్భంలో కోర్టు చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. అయన అచేతనుడైనా... ఆయన మెదడు పని చేస్తుంది కదా? అది ఎంతటి విధ్వంసాన్నైనా సృష్టిస్తుందని చెప్పడం దేనికి సంకేతమని నిలదీశారు. తుపాకి పట్టిన వారిని, ఆలోచించే వారిని, ప్రశ్నించే వారిని అందరినీ చంపుకుంటూ పోతారా అంటూ ప్రశ్నించారు. భారతీయ న్యాయ వ్యవస్థ రాజ్యాంగానికి లోబడి కాకుండా, నమ్మకాల నుంచి, దేవాలయాల ధ్వజ స్తంబాల నుంచి స్ఫూర్తి పొంది తీర్పులిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యమంటేనే మార్కెట్.. మార్కెట్ అంటేనే రాజ్యం అనే స్థాయికి ప్రజాస్వామ్యాన్ని నేటి పాలకులు తీసుకొచ్చారని అన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీని ఈ దేశం నుంచి తరిమి కొట్టడానికి 180 ఏళ్లు పట్టిందని మర్చి పోయిన పాలకులు, పెట్టుబడుల పేరిట అదే వలస వాదులకు ఎర్రతివాచి పరుస్తున్నారని విమర్శించారు. ఇండిగో ఉదంతమే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ చెగువేరాను పక్కన పెట్టి... సావర్కర్‌ను ముందు పెడితే మనిషి ఆలోచనలు, సమాజం తీరు మారుతుందనుకోవడం మూర్ఖత్వమన్నారు. అంతా అయిపోయిందనే నిరాశావాదం నుంచి బయపట పడాలని అభిప్రాయపడ్డారు. డోనాల్డ్ ట్రంప్ గెలిచిన చోటే మమ్దాని గెలిచాడని గుర్తు చేశారు. సమాజపు ఒడిదొడుకుల్ని, దారితప్పుతున్న ప్రజాస్వామ్య విలువలను నిఖిలేశ్వర్ తన రచనల ద్వారా చెప్పారని అన్నారు. అయితే చీకటి ఎప్పుడూ ఉండదనే శ్రీశ్రీ వ్యాఖ్యలను ఉదహరించారు. ప్రముఖ కవి నందిని సిద్దారెడ్డి మాట్లాడుతూ "సాహిత్యంలో రసజ్ఞులుంటారు.. వినిమయ దారులుంటారు. కేరీరిజం లేకుండా కవి లేడు. కవుల్లో గ్రూపులు, విభేదాలు ఇప్పటివి కాదు. ఆది కవి నన్నయ నుంచి నేటి వరకు ఉన్నారు. భవిష్యత్‌లోనూ ఉంటారు. నిఖిలేశ్వర్ విబేదించినా ఇదే వాస్తవం" అని సిద్దారెడ్డి అభిప్రాయపడ్డారు. ఎమెస్కో ఎడిటర్ చంద్రశేఖర్‌రెడ్డి పుస్తకాలను సభకు పరిచయం చేయగా, ప్రొఫెసర్ కల్పనా కన్నబిరాన్ జైలు వెనుక పుస్తకాన్ని, ప్రొఫెసర్ కట్టా ముత్యం రెడ్డి విద్యారంగ సమస్యలను ప్రస్తావించారు. అనంతరం పుస్తకాల రచయిత నిఖిలేశ్వర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలుంటాయని, విమర్శకుల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకుంటానని తెలిపారు. డాక్టర్ జతిన్ సమన్వయం చేయగా, కె రాహుల్ కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 విజయవంతం కావాలి

- సిఎం రేవంత్‌కు ఖర్గే లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025 విజయవంతం కావాలని ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఆకాంక్షించారు. పార్లమెంటు సమావేశాలు, ముందస్తు షెడ్యూల్ నేపథ్యంలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025కు హాజరు కాలేకపోతున్నానని తెలిపారు. ఈ మేరకు ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతాన్ని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



ప్రమాదానికి గురైన కారు

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

- ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కారు డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలైన ఘటన హైదరాబాద్‌లోని లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ రఘుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన ఆశ్రిత్ రెడ్డి (22), బాలాజీ మణికంఠ శివసాయి (23), రాహుల్, శ్రీకాంత్ స్నేహితులు. వీళ్ల నలుగురు వృత్తిరీత్యా ఐటి ఉద్యోగులు. వీరు ఆదివారం తెల్లవారుజామున క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు తార్నాకకు కారులో బయలు దేరారు. మౌలాలి నుంచి తార్నాక వెళ్తున్న క్రమంలో తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో లాలాపేట దోబీఘాట్ వద్ద పొగ మంచు కారణంగా డివైడర్ కనిపించలేదు. దాంతో మౌలాలి బ్రిడ్జిపై నుంచి వేగంగా వస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. దాంతో కారు నడుపుతున్న ఆశ్రిత్ రెడ్డి, పక్క సీటులో కూర్చున్న బాలాజీ మణికంఠ శివసాయి అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక సీట్‌లో కూర్చున్న రాహుల్, శ్రీకాంత్ గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న లాలాగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. గాయాలైన వారిని మల్కాజిగిరిలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రికు తరలించి చికిత్స అందిస్తున్నారు.

పట్టింపు లేని పనిమంతులు

- రెక్కలు ముక్కలు చేసుకున్నా పూటగడవని బతుకులు
- సంఘటితమైతేనే అసంఘటిత కార్మికుల్లో వెలుగులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు బుట్టదాఖలు
- భేష్‌గా కేరళ ప్రభుత్వ సంక్షేమ బోర్డులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఒక్కరు కాదు..ఇద్దరు కాదు... రాష్ట్రంలో కోటికిపైగానే అసంఘటిత కార్మికులున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో, ఆదాయాన్ని సమకూర్చి పెట్టడంలో నెత్తిన బరువంతా మోస్తున్నా వారి జీవితాలకు మాత్రం అదరవు లేదు. రెక్కలు ముక్కలు చేసుకున్నా పూటగడవని బతుకులుగా మారాయి. కనీస వేతనాల జీవోలను అమలు చేయడానికి కూడా పాలకులకు చేతలు రావడం లేదు. లాభాలను వదులు కోవడానికీ, కార్మికులకు జీతాలు పెంచడానికి యాజమాన్యాలు ఇష్టపడట్లేదు. ప్రభుత్వమూ వారికే కొమ్ముకాస్తున్నది. పైగా, 12 గంటల పనిచేయాల్సిందే అంటూ హుకుం జారీ చేస్తున్నది. అసంఘటిత కార్మికుల కోసం ఏదో చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి కోసం ప్రకటించిన సంక్షేమ పథకాలను బుట్టదాఖలు చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో అసంఘటిత కార్మికులంతా సంఘటితమై తమ హక్కుల కోసం కొట్లాల్సిన అవసరం నెలకొంది. కేరళలోని సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం 17 వెల్ఫేర్ బోర్డులను ఏర్పాటు చేసి వారికి మెరుగైన జీవితం అందించడానికి ఇతోధికంగా దోహదపడుతున్నది. రాష్ట్రంలో అసంఘటిత కార్మికులు కోటి మంది ఉన్నారు. అందులో అత్యధికంగా భవన నిర్మాణ కార్మికులు 30 లక్షల మంది దాకా ఉన్నారు. భవన నిర్మాణ కార్మికుల్లో నాలుగు లక్షలకుపైగా వలస కార్మికులున్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులే కాకుండా అసంఘటిత రంగ కార్మికుల జాబితాలో ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికులు 25 లక్షల మంది, బీడీ రంగ కార్మికులు ఎనిమిది లక్షల మంది, గిగ్ వర్కర్లు నాలుగు లక్షల మంది, తోపుడు బండ్ల కార్మికులు మూడు లక్షల మంది, మార్కెట్లలో గుమాసాలు రెండు లక్షల మంది, గ్రానైట్ కార్మికులు లక్ష మంది, హోటల్ కార్మికులు మూడు లక్షల మంది, సెక్యూరిటీగార్డులు నాలుగు లక్షల మంది, ఇంటి పనివారు లక్ష మంది, తదితరులున్నారు. వీరిలో ఎక్కువగా ఎస్సి, ఎస్‌టి, బిసి లాంటి వెనుకబడిన సామాజిక తరగతుల వారే ఉన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోవడం, చేతివృత్తులు దెబ్బతినటంతో అసంఘటిత కార్మికుల సంఖ్య వేగంగా పెరుగుతున్నది. వీరంతా ఎలాంటి సామాజిక, ఆర్థిక భద్రతలకు, చట్టబద్ధ హక్కులకు నోచుకోవడం లేదు. ఇటీవలి కాలంలో పర్మినెంట్ ఉద్యోగాలు తగ్గి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఫిక్స్‌డ్‌టర్మ్, డైలీవేజ్ ఉద్యోగాలు పెరుగుతున్నాయి. దీంతో వారి జీవితాలకు, జీతాలకు భద్రత లేకుండా పోతున్నది. అసంఘటిత కార్మికుల అనేక పోరాటాల ఫలితంగా సామాజిక భద్రత చట్టం వచ్చింది. రూల్స్ ఇంకా రూపొందకుండానే లేబర్‌కోడ్‌లతో ఆ చట్టం రద్దయిపోయింది.

గొప్పలకే కేంద్ర ప్రభుత్వ పథకాలు... కార్మికులకు దక్కని ప్రయోజనాలు

పేరుగొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కోసం తీసుకొచ్చిన పథకాలు తయారయ్యాయి. కార్మికులకు దక్కిన ప్రయోజనాలేం లేవు. అసంఘటిత కార్మికులు తమ వేతనంలో కొంత సొమ్మును కడితే ప్రధానమంత్రి శ్రమయోగిమన్‌ధన్ పథకం ద్వారా 48 ఏళ్లు దాటిన కార్మికులకు పెన్షన్ ఇస్తామని ప్రకటించింది. ఇప్పటివరకూ అతీగతీ లేదు. ఈ శ్రమ పోర్టల్‌లో రాష్ట్రానికి చెందిన 40 లక్షల మందికిపైగా కార్మికులు చేరారు. ఆ పథకంలో చేరిన తర్వాత కార్మికులకు ప్రమాదం జరిగినా, మరణించినా రెండు లక్షల రూపాయల పరిహారం ఇస్తామని ప్రకటించింది. కానీ, తెలంగాణలో నష్టపరిహారం అందిన దాఖలాలు లేవు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు పొద్దున లేస్తే ఈ శ్రమ పోర్టల్ గురించి గొప్పలు చెప్పుకోవడానికే సరిపోతున్నది. హెల్త్ ఇన్సూరెన్స్ పథకం, పిఎం జీవన్ జ్యోతి పథకాలు గాలిలో దీపంలా మారాయి.

హామీలకే రాష్ట్ర సర్కారు పరిమితం

రాష్ట్రంలోని అసంఘటిత కార్మికులకు అదిచేస్తాం..ఇది చేస్తాం అని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో గొప్పగా ప్రకటించింది. కార్మికుల విషయంలో తామూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ దారిలోనే నడుస్తామన్నట్టు వ్యవహరిస్తున్నది. హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పింది. ప్రతి మండలంలోనూ హమాలీల కోసం ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చింది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు అవుతున్నా హామీల వెల్ఫేర్ బోర్డు పట్టాలెక్కలేదు. ఆటో డ్రైవర్లకు ఏటా 12 వేల ఆర్థిక సహాయం చేస్తామని గొప్పగా ప్రకటించింది. ఆ హామీ నీటిమీది రాతలాగే మారింది. ఫుట్‌పాత్ వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తామనీ, వారికి వడ్డీలేని రుణాలిస్తామని పేర్కొంది. అదీ పట్టాలెక్కలేదు. రాష్ట్రంలోని సుమారు 8 లక్షల బీడీ కార్మికులకు ప్రయోజనం చేకూరేలా నాలుగు వేల రూపాయల జీవన భృతి ఇస్తామని ప్రకటించింది. ఆ హామీని కూడా నిలబెట్టుకోలేకపోయింది.

కేరళలోని ఎర్రజెండా ప్రభుత్వం భేష్

ఎప్పుడూ కార్మికుల సంక్షేమం కోసమే ఆలోచించే, వారి హక్కుల కోసం కొట్లాడే ఎర్రజెండా పార్టీల నేతృత్వంలోని కేరళ లెఫ్ట్ ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తున్నది. తమ ప్రాంతంలో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికులను ఆతిథ్య కార్మికులుగా గుర్తించింది. వారికీ హక్కులను కల్పిస్తున్నది. అసంఘటిత కార్మికుల కోసం 17 రకాల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసింది. హమాలీ కార్మికులకు ప్రమాదబీమా, ఆరోగ్య బీమా పథకాలను అమలు చేస్తున్నది. ప్రమాదంలో హమాలీ కార్మికుడు చనిపోతే రూ.10 లక్షల పరిహారం బాధిత కుటుంబానికి అందజేసి ఆర్థిక చేయూతనిస్తున్నది. గాయపడ్డవారికీ తీవ్రతను బట్టి పరిహారమిస్తున్నది. ఇండ్లు లేని కార్మికులను గుర్తించి సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఒక్కొక్కరికి రూ.7.80 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నది. పీఎఫ్ చట్టం పటిష్టంగా అమలవుతున్నది.

సంఘటితమై పోరాడితేనే హక్కులు : వంగూరి రాములు, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి

తెలంగాణ జనాభా మూడున్నర కోట్లు. అందులో అసంఘటిత కార్మికులే సంఖ్య చూస్తే కోటికిపైగానే ఉంది. జనాభాలో 30 శాతం వరకు ఉన్న అసంఘటిత కార్మికులు గోస పాలకులకు పట్టడం లేదు. ఎందుకంటే వీరంతా అసంఘటితంగా ఆయా రంగాల్లో ఉండటమే కారణం. బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వీరికి ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేస్తున్నాయి. అదే సమయంలో కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కోసం సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. మన తెలంగాణలో తమ హక్కుల కోసం అసంఘటిత కార్మికులు విడివిడిగా పోరాటాలు చేస్తున్నప్పటికీ వారంతా విశాల వేదికపైకి వచ్చి సంఘటిత పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది.